సమాచారం

27న ఓయూ బడ్జెట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 2023–24 వార్షిక బడ్జెట్ ఈ నెల 27న సెనెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఓయూకు 2023–24 విద్యా సంవత్సరానికి రూ.457.12 కోట్ల నిధులు కేటాయించిన విషయం విదితమే. ప్రతి ఏటా ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లకు బ్లాక్ గ్రాంట్స్ నిధులను వినియోగించనున్నారు. యూనివర్సిటీ విద్యార్థుల ఫీజులు, స్థిరాస్తులు, క్రీడా మైదానాలు, ఇతర వనరుల నుంచి నిధులు రాబడుతుంది. అయి నా నిధులు సరిపోవడంల లేదని ఓయూకు రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వేణుకుమార్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జాగ్రఫీ విభాగం నుంచి అవ్వారు వేణుకుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.లక్ష్మయ్య పర్యవేక్షణలో నల్గొండ జిల్లాలో భూ వినియోగ మార్పులను రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ సమాచారం అనే అంశం పై పరిశోధన పూర్తి చేసినందుకు డాక్టరేట్ డిగ్రీని పొందారు. తెలంగాణ ఎంటీసీల ఫోరం ఫౌండర్ చైర్మన్, ఎస్ఎఫ్ఐ నేతగా సేవలందించిన ఆయన ఇంతకు ముందు ఎల్ఎల్‌బీ పూర్తి చేసినట్లు తెలిపారు.

మహిళలు
అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి



మహిళ ఉద్యోగినులతో కలిసి సైకిల్ మారథాన్‌లో పాల్గొన్న డాక్టర్ వెంకటి

రాంగోపాల్‌పేట్: మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు దూసుకెళ్లాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో ప్యాటీ సెంటర్‌లోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద ఆదివారం మహిళలకు సైకిల్ మారథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. నేడు మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నారన్నారు. నేల నుంచి నింగి వరకు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా పోటీ పడుతున్నారన్నారు. సమాజంలో నేటికీ అనేక చోట్ల ఆడపిల్లలపై వివక్ష, అవమానాలు చోటు చేసుకుంటున్నాయని దీనిపై మరింత చైతన్యం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



రాత పుస్తకాలు అందజేస్తున్న నివేదిత

రసూల్‌పురా: దివంగత ఎమ్మెల్యే సాయన్న జయంతిని పురస్కరించుకుని ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో సాయన్న కుమార్తెలు హాజరయ్యారు. రెండవ వార్డు చంద్రనగర్ కాలనీలో రఘురామన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయన్నతో తనకున్న అనుబంధాన్ని రఘురామన్, శ్యామ్ వివరించారు. ఏడో వార్డులో మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత ఆధ్వర్యంలో గన్‌రాక్ కాలనీలో పది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయగా, ఎనిమిదవ వార్డు బొల్లారం చింతల్ బజార్ బీఆర్ఎస్ కార్యాలయంలో సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్, అంజనేయులు, నాగేష్, వినోద్, మోహన్, గణేష్, శ్రీను, శేఖర్, సుబ్రహ్మణ్యం, సందీప్ మనోజ్, జవహర్ బాల్‌రాజ్, రాజు గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న కస్తూరీ బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటియూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంగూరి రాములు మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. 12–14 గంటల పాటు పని చేస్తున్న బోధనేతర సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు, హక్కులు లభించకపోవడం బాధాకరమన్నారు.

ఘంటసాల పుస్తకాలు అందజేత

చిక్కడపల్లి: శతాబ్ది గాయకుడు ఘంటసాల పాడిన 2006 పాటలు, పద్యాలు, శ్లోకాలతో డీవీఎస్ నారాయణ సంకలనపరచిన 150 పుస్తకాలను ఆదివారం గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో 150మంది అభిమానులకు అందజేశారు.



తార్నాక చౌరస్తాలోని ఓ హోటల్ ముందు నో పార్కింగ్ ప్రాంతంలో అధిక సంఖ్యలో వాహనాల పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌జాంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం అక్కడికొచ్చే వారి సంఖ్య మరీ ఎక్కువగా ఉంటుంది. వారి వాహనాలను యథేచ్ఛగా రోడ్డుపై గంటల తరబడి నిలిపి వెళ్లిపోతుండటంతో సికింద్రాబాద్ వైపు నుంచి హబ్సిగూడ, ఉప్పల్ వైపు వెళ్లే బస్సులు, వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఒక వైపు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ వారు ఫుట్‌పాత్‌ను పూర్తిగా ఆక్రమించడంతో పాదచారులు రోడ్డుపై నుంచి వెళ్లాల్సి వస్తుంది. ఇంతా జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమ బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. –లాలాపేట

బాబోయ్ దొంగలు





అడ్డగుట్టలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ దొంగలు పెట్రేగిపోతున్నారు. అర్ధరాత్రుల్లో పార్కింగ్ చేసిన బైక్‌ల నుంచి గుట్టు చప్పుడు కాకుండా పెట్రోలు దొంగిలిస్తున్నారు. తుకారాంగేట్ సాయినగర్, ఇందిరా గాంధీ విగ్రహం సమీప ప్రాంతాల్లో గుర్తు తెలియని దొంగలు తమ వాహనాల్లోంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఏ మాత్రం భయం లేకుండా దొంగలు ఇలా రెచ్చిపోతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.అంతేకాక పెట్రోల్ దొంగిలించిన తర్వాత ఆ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్లు గుర్తించిన దొంగ సదరు సీసీ కెమెరాలు పగలగొట్టి వెళ్లిపోయాడు. పోలీసులు బస్తీల్లో మరింత నిఘా పెంచాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. –అడ్డగుట్ట

పెంచిన ధరలు తగ్గించాలి



గంట రాజుసాగర్

అడ్డగుట్ట: ఇష్టానుసారంగా ధరలు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారం మోపుతున్నాయని అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటరాజు సాగర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెంచిన గ్యాస్, బస్సు టికెట్, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమంపై బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెట్రోల్, డీజిల్‌పై ఉన్న వ్యాట్‌ను తగ్గించాలన్నారు. అదే విధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ ప్రభుత్వం రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.1200 చేసి సామాన్యులపై భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని రాస్తారోకోలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పెంచిన బస్సు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు, పన్నులు తగ్గించాలని లేకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామన్నారు.

అధునాతన హంగులతో ఫంక్షన్ హాళ్లు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పేద ప్రజల సౌకర్యార్థం అధునాతనమైన హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తెలిపారు. లాలాపేట మున్సిపల్ మైదానంలో రూ. 6.99 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ పనుల్లో భాగంగా ఆదివారం మొదటి స్లాబ్ నిర్మాణం చేయగా వాటిని పద్మారావు గౌడ్ పరిశీలించి మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసిన, ప్రస్తుతం కొనసాగుతున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాళ్ల వివిధ సదుపాయాలతో నగరంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు. అనంతరం ప్రొ. జయశంకర్ స్టేడియంలో కొనసాగుతున్న అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల గల స్విమ్మింగ్ ఫూల్ పనులను పరిశీలించారు.ఆయన వెంట జీహెచ్ఎంసీ అధికారులు డీఈ రఘు, ఏఈ వెంకటేష్, నాయకులు సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్‌రావు, కూరెల్లి నాగరాజుగౌడ్, మల్లికార్జున్, రమేష్, నాగులు పాల్గొన్నారు.

పరామర్శ..

అడ్డగుట్ట: అడ్డగుట్ట మాజీ కార్పొరేటర్ నక్క మల్లీశ్వరి భర్త అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఆదివారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, నేతలు నక్క మధు, లింగాని శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

రసూల్‌పురా: ఒలింపిక్స్ కామన్వెల్త్ ఏషియన్ గేమ్స్ తరపున పాల్గొనే క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందజేయడమే కాకుండా ఆయా దేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొనే విధంగా క్రీడాకారులను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. యూనిటి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో 16 రోజులుగా జరుగుతున్న కార్డినల్ డాక్టర్ పూల అంథోని ప్రైజ్‌మనీ ఫుట్‌బాల్ మొదటి టోర్నమెంట్ పోటీల ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో క్రీడా రంగంలో అగ్ర దేశాల సరసన నిలిచి క్రీడా రంగంలో ముందంజలో ఉంటుందన్నారు. తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో ఆడిన ఫుట్‌బాల్ క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ పోటీల్లో తలపడ్డారని గుర్తు చేశారు. క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని సూచించారు. ఓడిన వారు నిరాశతో ఉండరాదని భవిష్యత్‌లో గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. విజేత జట్టుకు రూ. 50 వేలు, రన్నరప్ జట్టుకు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బాలశౌరి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ జైప్రకాష్, డాక్టర్ వికే. స్వామి, సీఈవో మధుకర్ నాయక్, ఆకాడమీ చైర్మన్ లూయిస్ అరుల్‌రాజ్, అధ్యక్షులు ఎడ్వర్డ్ జాకారియాస్, జనరల్ సెక్రటరి మైకల్ అబ్రహం, కోశాధికారి రేమాండ్ హర్వర్డ్ పాల్గొన్నారు.

అనుమతి వచ్చింది.. ప్రచారం మొదలైంది!



కంటోన్మెంట్: బోర్డు ఎన్నికల్లో అధికారిక ప్రచారం మొదలైంది. బోర్డు అధికారుల అనుమతితో నాలుగో వార్డు అభ్యర్థి గడ్డం శ్రవణ్ కుమార్ ఎల్ఈడీ మొబైల్ వ్యాన్‌తో ప్రచారం ప్రారంభించారు. ఈ మేరకు బోర్డు అధికారులకు నాలుగు రోజుల క్రితమే దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు అనుమతినిచ్చారు. బస్తీల్లో పాదయాత్రలు, ఇంటింటి ప్రచారం, ర్యాలీ, మొబైల్ వాహనాలు, హోర్డింగ్‌లు ఇలా ఎలాంటి ప్రచారం చేపట్టినా ముందస్తుగా కంటోన్మెంట్ అధికారులతో పాటు పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

త్వరలో సింగిల్ విండో ఏర్పాటు

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా ఎలాంటి ప్రచారాలు నిర్వహించవద్దని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ గత వారమే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వివిధ వార్డు నుంచి పెద్ద సంఖ్యలో ప్రచారాల కోసం అనుమతులు వస్తున్నాయి. అయితే ఇప్పటికీ రిటర్నింగ్ అధికారి నియామకం జరగలేదు. శనివారం వరకు నూతన ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మూడు రోజుల పాటు సాగింది. దీంతో మెజారిటీ బోర్డు అధికారులు ఈ విధుల్లోనే నిమగ్నమవ్వడంతో ప్రచార అనుమతులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. త్వరలోనే ప్రచార అనుమతుల బాధ్యతను బోర్డు సీనియర్ అధికారికి అప్పగించి, సింగిల్ విండో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆదివారం అనుమతి..

నాలుగో వార్డు నుంచి బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకుని, ప్రచారం కోసం గత నెల 28న బోర్డు అధికారులకు దరఖాస్తు చేసుకున్నానని శ్రవణ్ తెలిపారు. అయితే అనుమతుల జారీ విషయంలో స్పష్టత లేకపోవడంతో అధికారులు సకాలంలో స్పందించలేదు. ఎట్టకేలకు ఆదివారం నుంచి ఎల్ఈడీ మొబైల్ వాహనం ద్వారా ప్రచారం చేసుకునేందుకు అనుమతించారు. సంబంధిత పత్రాలను పోలీసులకు సమర్పించి ప్రచారం ప్రారంభించాం. రాబోయే రోజుల్లోనూ ప్రచార అనుమతులకు జాప్యం జరిగితే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రచార అనుమతుల జారీ ప్రక్రియను సరళతరం చేయాల్సిందిగా అధికారులను కోరామన్నారు.

దళితుల అభ్యున్నతికే 'దళితబంధు'



లబ్ధిదారుడికి కారు తాళాలు అందజేస్తున్న మంత్రి తలసాని

అమీర్‌పేట: దళితులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు దళిత బంధు పథకం ఎంతో దోహదపడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.సనత్‌నగర్‌లోని లింగయ్యనగర్‌కు చెందిన అనిల్‌కు దళితబంధు ద్వారా కొనుగోలు చేసిన కారును ఆదివారం ఆయన కార్పొరేటర్‌తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళితులు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు.ఇప్పటికి అనేక మంది దళిత బంధు కింద వివిధ యూనిట్లను ఏర్పాటు చేసుకుని ప్రయోజనం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మి బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బండ ప్రకాష్

రాంగోపాల్‌పేట్: శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలువగా మంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

లిక్కర్ స్కాం నుంచి దృష్టి మరల్చేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు నాటకం

ప్రొ గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు నాటకం ఆడుతున్నారని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తొమ్మిదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉండి, పార్లమెంట్ సభ్యులుగా పని చేసినా ఏనాడు మహిళా రిజర్వేషన్‌పై ప్రస్తావించని ఎమ్మెల్సీ కవిత ఆకస్మికంగా మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఈ నెల 10న డిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి మంత్రి వర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం లేనప్పుడు మాట్లాడని కవిత, తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలపై ఏనాడు ప్రశ్నించలేదన్నారు. లిక్కర్ స్కాంలో అరెస్టు అవుతానని భయం ఆమెను వెంటాడుతున్న కారణంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు కొత్త నాటకానికి తెరలేపారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయన్నారు. అన్ని రంగాల్లో 50 శాతం అవకాశాలు కల్పించాలని అప్పుడు మాత్రమే మహిళల గురించి మాట్లాడే నైతిక అర్హత కవితకు ఉంటుందన్నారు.

నేటి గాయకులకు రఘురామయ్య స్ఫూర్తి

అమీర్‌పేట: ఈల పాటలోని మాధుర్యాన్ని తెలుగు ప్రజలకు అందించిన మొట్టమొదటి గాయకుడు ఈల పాట రఘురామయ్య అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం బేగంపేట కుందన్‌బాగ్‌లో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈల పాటల రఘురామయ్య జయంతి సభలో ఆయన హాజరై మాట్లాడారు. ఈల పాట ఒక వినూత్న ప్రక్రియ అంటూ నేటితరం గాయనీ, గాయకులు రఘురామయ్య స్ఫూర్తితో ఈల పాట సాధన చేయడం సంతోష కరమన్నారు.ఈ పాట విశిష్టత ఈ తరానికి తెలియక పోవచ్చు గాని పాతతరంలో ఎందరో అభిమానులు ఉండేవారన్నారు. ప్రసిద్ధ రంగస్థల నటులు, పద్య గాయకులు అక్కిరాజు సుందరరామమూర్తి మాట్లాడుతూ.. రఘురామయ్య ఎంతో గొప్ప గాయకుడో అంత గొప్ప నటుడని ఆయన వేసిన కృష్ణ పాత్ర రంగస్థలంలో విశేష ఆదరణ అభించిందని గుర్తు చేశారు. దేశ విదేశాల్లో సైతం రఘురామయ్య ఈల పాటకు ఎంతో ఆదరణ ఉందని ఎండోమెంట్ మాజీ జాయింట్ కమిషనర్ ఎల్.వెంకట్‌చారి అన్నారు. అనంతరం ఈల పాటల గాయనీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకృతి సుధాకర్ విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షులు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఈల పాటల గాయనీని సత్కరించిన మధుసూదనాచారి

పేదల సొంతింటి కల నెరవేర్చిన సాయన్న



సాయన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రులు



సాయన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

● మంత్రులు తలసాని, మల్లారెడ్డి

రసూల్‌పురా: దివంగత ఎమ్మెల్యే సాయన్న భౌతికంగా మనమధ్య లేకున్నా అందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సాయన్న జయంతిని పురస్కరించుకుని సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ వద్ద మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాయన్న విగ్రహాన్ని మంత్రి మల్లారెడ్డి సాయన్న కుమార్తెలు నివేదిత, నమ్రతతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం సాయన్న తపించారన్నారు. సాయన్న ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు మారేడుపల్లి, సిల్వర్ కాంపౌండ్, మడ్‌ఫోర్ట్‌లో డబుల్ బెడ్రూమ్‌లు కట్టించి ఇచ్చేందుకు విశేషంగా కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి గజ్జెల నాగేష్, బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్, నళిని కిరణ్, పాండుయాదవ్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సాయన్నకు నివాళి..

రాంగోపాల్‌పేట్: మోండా మార్కెట్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం దివంగత ఎమ్మెల్యే సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెజిమెంటల్‌బజార్‌లోని సంతోషీమాత దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సాయన్న కుమార్తెలు నివేదిత, నమ్రతలతో కలిసి ఆ పార్టీ నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, హరికృష్ణ, కర్ణకుమార్, నర్సారెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, అశోక్‌బాబు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సహపంక్తి భోజనం చేస్తున్న మన్నే క్రిశాంక్

రసూల్‌పురా: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మన్నే క్రిశాంక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం బాలంరాయి ఈద్గా అంబేడ్కర్ నగర్‌లో మహిళలతో కలిసి క్రిశాంక్ సంబురాలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళ సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ మహిళాసాధికారికత వంటి అంశాలపైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని క్రిశాంక్ పేర్కొన్నారు. రఘు, మోని, సూరజ్, శ్రీను, కిరణ్, బుచ్చి, నవీన్. త్రివేద్ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పీజీ మెడికల్ విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్

సాక్షి, సిటీ బ్యూరో: సనత్‌నగర్‌లోని సేయింట్ థెరెస్సా హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన బేసిక్ లాప్రోస్కోపీ స్కిల్స్ వర్క్‌షాప్‌లో నగరంతో పాటు ఏపీలోని వివిధ మెడికల్ కాలేజీల నుంచి జనరల్ సర్జరీ, గైనకాలజీ చదువుతున్న పోస్ట్ గ్రాడ్యుయేట్లు హాజరై లాప్రోస్కోపీ స్కిల్ టాస్కులు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా కోర్స్ డైరెక్టర్, డా టీ.వరుణ్ రాజు మాట్లాడుతూ.. ఈ ఆధునిక టెక్నాలజీ కాలంలో రోగికి మంచి సేవలు అందించాలంటే భవిష్యత్తు ఉన్న లాప్రోస్కోపీ టెక్నిక్ ను పీజీ నుంచే నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మిన్ థామసమ్మ, డా. లలిత, డా.ఎన్‌వీఆర్ మూర్తి, డా. అరుణ, డా. శోభా పాల్గొన్నారు.



మహాసభలను జయప్రదం చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: సీపీఐ సికింద్రాబాద్ మూడవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం అడ్డగుట్టలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ.. వచ్చేది అచ్చేదిన్ అంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు నిత్యావసరాలైన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజల బతుకులపై భారం మోపుతుందన్నారు. మరోవైపు జాతీయ సంపద అంతా ప్రైవేటుపరం చేస్తూ ఆదానీ, అంబానీలకు దోచి పెడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం కోసం మత విద్వేషాలను రెచ్చగొడుతుందని ఆరోపించారు. అదే విధంగా సికింద్రాబాద్ నియోజకవర్గం సమస్యలకు కేరాఫ్‌గా మారిందన్నారు. సమస్యల పరిష్కారానికి అనేక దఫాలుగా పోరాటాలు చేసినప్పటికీ పాలకులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 12న లాలాపేట్‌లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో సీపీఐ నాయకులు ఉమర్‌ఖాన్, సోమయ్య, యాదగిరి, యూసుఫ్, లతీఫ్, మల్లేష్, చారి, ఖాజా, శంకరయ్య, పద్మ, నారాయణ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సాహిత్యమే పట్టుకొమ్మ



పురస్కారాల గ్రహీతలతో వక్తలు

బన్సీలాల్‌పేట్: సనాతన సంస్కృతి సంప్రదాయాలను ముందు తరాలకు అందించడానికి సాహిత్యం ఎంతో దోహదపడుతుందని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పద్మారావునగర్‌లోని శివానంద ఆశ్రమంలో తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ పాలమూరు, అక్షర కౌముది సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ మల్కాజిగిరి, వినాయక డెవలపర్స్ సంయుక్త అధ్వర్యంలో ఆదివారం విశిష్ట మహిళా ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, తెలంగాణ మహిళా సాహిత్య సంస్కృతిక సంస్థ పాలమూరు అధ్యక్షురాలు రావూరి వనజ, అక్షర కౌముది సంస్థ అధ్యక్షులు తులసి వెంకటరమణాచార్యులు పాల్గొని మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి స్త్రీకి ప్రముఖ ప్రాధాన్యత ఇచ్చేవారని, స్త్రీ ప్రాధాన్యత గల అనేక ఇతిహాస పురాణాలలో స్త్రీ వైశిష్ట్యాన్ని తెలిపారన్నారు. సమాజ చైతన్యానికి పట్టు కొమ్మలు సాహిత్యమని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళా మూర్తులు జ్ఞాన ప్రసూన శర్మ, మేకల అనురాధ, బి.దీప్తి రావు, లంక వెంకట సూర్యసుబ్రహ్మణ్యేశ్వరి, డాక్టర్ అమరవాది నీరజ, డాక్టర్ దాశోజు పద్మావతి, బాలసరస్వతీలకు మహిళా స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంత రెడ్డి, శ్రీదేవి, మనోహర్‌రెడ్డి, అరుణ, శిఖా గణేష్, జేవీ కుమార్, ప్రవీణ్, ఇంద్రావత్, రాహుల్, సుజాత, సుతారం, వెంకటనారాయణ, కృష్ణకుమార్, రామచంద్రుడు పాల్గొన్నారు.